# వరదరాజేశ్వరి

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

౧

బహుమాసముల క్రిందట సమరయాత్ర వెడలి దుర్భేద్యము లగు దుర్గముల బెక్కింటిని జయించి, దోర్బలులగు ప్రభువుల బెక్కుర నోడించి ప్రాభవోపేతమగు దనదిగ్విజయసూచకముగా జయస్తంభముల బెక్కింటినందందు నెలకొల్పి, తుట్టతుదకు దుర్నిరీక్ష్యప్రతాపుడగు ప్రతాపరుద్రగజపతిని చాతుర్యమునజయించి, యక్కటకవల్లభుని తనయయైన రుచీదేవిని బరిణయమాడి చతురంగబలములతోడను, అగణితధనరాసులతోడను, శచీసహితుండగు పురందరునివలె రుచీసహితుండై కృష్ణదేవరాయ లఖండవైభవముతో బురప్రవేశము నేసి మూడు నాళ్లయినగాలేదు. ఆ రాజేంద్రుని స్వాగతోత్సవమునకై వేసినపందిళ్లు, కట్టినతోరణంబులు, తీర్చినరంగవల్లులు, యెత్తినధ్వజపతాకలు, పెట్టిన యంగళ్లు యింకను అట్లేయున్నవి. స్త్రీలును, బాలబాలికలును, ఉత్సవసందర్భమున పెట్టుకొనినయలంకారములు, ధరించినవస్త్రములు, పూసికొనిన లేపనములు, రాసికొనిన యత్తరువులు, వేసికొనిన తాంబూలరాగములు, యింకను తొలగలేదు. ఏ వీథి తిలకించిన, ఏ యంగడిని జూచిన, నేగృహంబునుగాంచిన యుత్సవచిహ్నములింకను కనుమాయక కనుపించుచునే యున్నవి. కృష్ణరాయ ప్రభుని దోర్బలమును, తిమ్మరుసుమంత్రి బుద్ధిబలమును సమరయాత్రకువెడలివచ్చిన యోధులింకను వారలకు నద్భుతంబు గొలుప వివరింపుచునే యున్నారు; ఆనందాశ్చర్యములతో జనులు వినుచునే యున్నారు. ఇంతలో యెల్లరిమనములు కలకజెంద నంతఃపురములో కలిగిన దొక్క విశేషము.

౨

అపుడే తెలతెలవాఱుచున్నది. మహారాజును మేల్కొల్పుటకు మ్రోగెడి మంగళతూర్యరవంబులింకను మ్రోగుచునేయున్నవి. ఆ నగారా మ్రోతలకు నిద్రనుండి మేల్కొని దాసదాసీజనమప్పుడే నిత్యకృత్యములకు గడంగినారు; కాని యున్నట్టుండి పనిపాటలాగిపోయినవి. ఎవరిపనులు వారుచేసికొనక యెక్కడివారక్కడే గుంపులుకూడి గుసగుస లాడుచున్నారు; ఒకరిచెవి యొకరు కొఱికికొనుచున్నారు; అమ్మక్కయని ముక్కుపై వ్రేలు వేసికొనుచున్నారు; 'ఎంతసాహసి' యనుచున్నారు. "శిరశ్ఛేదము చేసినను పాపము లే"దనుచున్నారు. "మగనినే చంపుటకు సాహసించిన మగువ యెంతకు చాల"దనుచున్నారు. "నిజముగా నట్టిదాని నంతఃపురమున నుంచుకొనుట రాజునకును, రాజ్యమునకును చేటే" యనుచున్నారు. "ఇది ఆమెతప్పుగాదు, మహారాజుతప్పే. ఓడిపోయినవానిబిడ్డను మోహపడితెచ్చుకొనిన అది చెఱుపు చేయక చెలిమిచేయునా? ఇది రాజుకు తోచకున్న మంత్రికైన యేల తోచకపోవలె"ననుచున్నారు. ఈ విధముగా యెవరికితోచిన విధమున వారనుచున్నారు. కాని యిది మహారాజునకును విశేషించి యంతఃపురమునకును సంబంధించిన విషయముగాన యీపలుకులన్నియు గుసగుసలలోనే అణగుచున్నవి, సంజ్ఞలలోనే చల్లారుచున్నవి.

స్త్రీలు స్త్రీలతో, పురుషులు పురుషులతో, పురుషులు స్త్రీలతో, స్త్రీలు పురుషులతో, దాసీలు దేవేరులతో, దేవేరులు బంధుజనముతో, ఒకటే మంతనము, ఒకటే యబ్బురపాటు, ఒకటేచర్చ. అట్టుడికినట్టు లుడికిపోవుచున్నది.

మహారాజగు కృష్ణదేవరాయలు నిత్యము లేచు సమయమైనకాలేదు; కాని యానాడప్పటికే నిద్రనుండి లేచి తిమ్మరుసుతో రహస్యాగారమున యోచింపుచున్నాడు. పూర్ణేందునిభమైన యామహారాజువదనమున కత్తివాటువేసిన నెత్తురులేదు. లజ్జ, భీతి, చింత, నిరాశ మున్నగు భావములెన్నియో యాయవనీపతి ముఖమున ప్రతిబింబించుచున్నవి. ప్రభుహితైషియగు నావృద్ధసచి

వుడు గూడ నిర్విణ్ణుడై యట్టె మహారాజు ముఖావలోకనము సేయుచు కూర్చున్నాడు. కొన్ని నిముసములు గడచిపోయినవి. వృద్ధామాత్యుని పెదవులు చలించినవి. "ప్రభూ!" అనినాడు. "ఏమిఅప్పాజీ"యనినాడురాజు. "మొదటితప్పిదము క్షమార్హముగదా! మఱియొక యవకాశమిచ్చు టవసరమగునేమో" అనినాడు శంకింపుచు మంత్రి.

"అప్పాజీ! మొదటితప్పిదము క్షమింపదగినదగుట వాస్తవమే కాని యీవిషయమునమాత్రము వట్టులు కాదు. భర్తృవిధకుతూహలమునై యుండెడిస్త్రీయేడ? పరస్పరానురాగదాయకంబగు దాంపత్యధర్మమేడ? బలవంతపువివాహ మనర్థదాయకము. ఆమె చిత్తవృత్తి నెఱుంగక యనురక్తుడ నగుటబట్టియేగదా నాకిట్టి ప్రమాదము వాటిల్లెను. మఱియు నామె పగతునితనయ; తనతండ్రిని ఓడించినక్రోధ మామె మనంబున నగ్గలమై ప్రజ్వరిల్లుచుండనోపు. కావుననే ఆమె యట్టిసాహసకృత్యమునకు సాహసించినది. కాన యిక నామెతోడి పొత్తు తగదు."

"అయిన నిక నామె నేమిచేయుదురు.?"

"పుట్టినింటికి బంపివేయుదును. ఆమె అభిప్రాయమెట్లున్నదో? ఆమె అభిప్రాయముతో మనకు పని లేదు. బలవంతముగనైన బంపివేయుటయే కర్తవ్యము. కాన అప్పాజీ! అందులకు తగినసన్నాహము గావింపుము."

ప్రభుఆజ్ఞను సమ్మతించి వృద్ధామాత్యుడు వెడలిపోయెను. తాబడిన భంగపాటువలన నాందోళితహృదయుడై రాయ లేకాంతగృహంబున కరిగెను.

ప్రభుని యుత్తరువుప్రకార మాడెనమే కటకరాజకుమారి పంపివేయబడినది.

## 3

గజపతి రాజకుమారిని శిబికారోహణుజేసి సాయుధులగు నాశ్వికులును, పదాతులును గొనివచ్చుచుండిరి. మార్గము కొండగుట్టచేతను భూరితరులతాగుల్మంబులచేతను భయంకరవనసత్వములచేతను నగమ్యముగా నుండెను. మఱియు నాటవికులగు దారిదోపిడికాండ్ర బాధయుగలదు. కాన అస్తంగతభాస్కరుని యరుణకాంతులు చూచినకొలది రాబోవురాత్రిని దలచి అడలుచు యోధులు "ఇక ప్రయాణముసేయుట ప్రమాదము యీరాత్రి యేచిన్నపల్లెయందైన నిలుచుటమంచి" దని దళపతితో జర్చించుచుండిరి. దళపతియునదియే మనంబున నిశ్చయించుచుండెను. ఇంతలో నొకచిన్నపల్లె గన్పడెను. దీనిని దాటిన నింతలో మరల పల్లెగన్పడుట కష్టమనియు, తాము సాంద్రారణ్యములో చిక్కుపడవలసివచ్చుననియు యోధులు సేనాపతికి విన్నవించిరి.

"అవును నిజమే. దేవియభీష్టముకూడ కన్గొని యనుజ్ఞయైనచో యీరాత్రి యిక్కడ విడిసి రేపకడ పయనింత" మని దళపతి యనుచరులకు బలికి శిబికను సమీపించెను. 'లక్ష్మి', 'లక్ష్మి' యని దేవి దాసినిపిలిచెను. దళపతి మాటవినిలక్ష్మి శిబికతలుపోరగాదీసి "ఏమిపని అయ్యా" అనెను.

"ప్రొద్దుక్రుంకినది. ఇక ప్రయాణము సేయుట అపాయకరము. ఈ రాత్రి యిక్కడ నిలిచిన బాగుండునని యనుకొనుచున్నాము. దేవిగారి అభిప్రాయ మెట్లున్నదో కనుగొనుము. 'దేవిగారి అనుమతి ప్రకారము పయనము సేయునది' యని మహారాజగారు సెలవిచ్చిరి" యనెను

సేనాపతి పలుకులను విని లక్ష్మి దేవివంక జూచి నిట్టూర్పువిడిచెను. అప్రయత్నముగా నామె కన్నులు చెమ్మగిల్లెను. సేనాపతికి జవాబీయజాలక పోయెను. "ఏమిలక్ష్మి! అమ్మగారి నడిగితివా?" అని ప్రత్యుత్తరమునకు వేచియున్న సేనాపతి మరల యడిగెను.

సేనాపతి మరల ప్రశ్నించుటచే లక్ష్మికి పట్టరాని దుఃఖమువచ్చెను. కాన "అయ్యా, దేవిస్మృతి హీనయైపడియున్నది. విజయనగరమునుండి బయలుదేరినది మొదలామెస్థితి యటులనేయున్న" దని శోకగద్గదస్వరముతో నే లక్ష్మి బదులుపలికి "అయినను నొకమాఱు పిలిచి చూచెద" నంచును "అమ్మా! అమ్మా! అమ్మా!" అనెను.

మూడవ పిలుపునకు హీనస్వరముతో "ఏమి!" అనెను దేవి.

"అమ్మ సేనాపతి అడుగుచున్నాడు."

"ఏమని?"

"ప్రొద్దు గ్రుంకినది, ఇక ప్రయాణము చేయుటకష్టము. కాన, యీరాత్రి యిక్కడ నిలుచుట కనుమతింతురా?" అని.

"ఎక్కడ?"

"ఇక్కడ నేడున్న పల్లెయందు"

"మహారాజాంతఃపురమును పల్లెయందు వేమి?"

మతిహీనమైన దేవిపల్కు లక్ష్మిని మరల దుఃఖములో ముంచెను. "అయ్యో! ఎంతటిబుద్ధిశాలిని! ఎంత వెఱ్ఱిదై పోయిన" దని లక్ష్మి యించుక బిగ్గరగనే విలపించెను. కాని సేనాపతికి జబాబొసంగు పని యొకటిగలదు గదా; కాన "అమ్మా! మహారాజాంతఃపురమునకును మనకును ఋణముతీఱినదికదా," అనెను లక్ష్మి.

"తీఱె," అన్నది దేవి.

"కటకమున కేగుచున్నాము."

"కటకమునకా? అక్కటకటా! అక్కటికము లేక నల్లుడని యైన శంకింపక, మహారాజని యైన జంకక, నిజకుమారికకు వైధవ్యము వచ్చునని యైన చింతింపక, శయ్యామందిరమున భర్తను వధింపుమని దుర్బోధలు జేసినాకును, నా పతికిని ఎడబాటు గావించిన యామాతృగృహమునకా? అయ్యో! పోజాలను. పోజాలను. ఆహా! ఆమహారాజెంతటి యుదారుడు! ఎంతటి కరుణార్ద్రహృదయుడు. ఎంతటి సజ్జనశేఖరుడు! ప్రథమ సమావేశతత్పరత మహోత్సుకుడై వచ్చిన దన్ను సముచిత సల్లాపసత్కారములచే సంభావింపక వాడికత్తిచే బొడువనున్న నాయకృత్యమును గన్నులారగాంచియు, చెఱను బంధింపక, శిరచ్ఛేదము సేయక, చిత్రవధ గావింపక సగౌరవముగ సాయుధాశ్వికపదాతులను సాయమిచ్చి పుట్టినింట కంపుచుండెనే. ఆహా! ఏమి యా మహామహుని యౌదార్యము! అయ్యో! ఇట్టి పావనచరితు నేగదా నేజంప నుద్యోగించితిని. అక్కటా! నా కృత్య మెంతదారుణము! ఎంత క్రూరము! ఎవరు చూచెదరో యనుభీతిని నాతురతతో నేను మొలయందు దోపికొనిన పదనుకత్తి దైవికముగా నేలబడినది. లేకున్న...... లేకున్న...... మృత్యువునని యొఱుగక ముగ్ధనని తలంచి యా మహారాజు నన్ను చేరవచ్చియుండును. మహాహంతకి నగు నేను నిశితకృపాణధారనా మధ్యమలోకమందారుని, ఆ దీనజనచింతామణిని, ఆ కవిజనకల్పకమును, ఆ యాశ్రితావన దీక్షితుని వ్రచ్చియుండును. ఆదయాసాంద్రుని క్రొన్నెత్తురుచే భూతలమపవిత్రమైయుండును. కాని ఆ మహాత్ముని ధర్మశీలమే యాతని రక్షించినది. ప్రజలకు దుఃఖము, నాకపకీర్తి రెండును తప్పినవి...... ఆ పొరపాటు లేదు. లేదు. నాకపకీర్తి తప్పినదా? లేదు. ప్రజలదుఃఖము తప్పినది. మహారాజు ప్రాణోపద్రవము తప్పినది. కాని నా యపకీర్తి తప్పలేదు. అయ్యో! నా దుష్క్రియ శాశ్వతమై పోయినది. దీనికి నిష్కృతి లేదు. అయ్యో? నేడాంధ్ర కర్ణాటరాజ్యములందలి యాబాలగోపాలము నా దుశ్చేష్టనే వర్ణించుచు నన్ను దూషించుచుందురుగదా? ఇక నా యపకీర్తి తొలగిన దెక్కడ? లేదు. పతికి దొలగితిని; ప్రభుతకు దొలగితిని; కాని అపకీర్తికి మాత్రము తొలగలేదు. అయ్యో! నా పాపకృత్యమును తలంచిన కొలది నా హృదయమున నెంతవేదన, యెంత దుఃఖము! అకటా! భరింపరాకున్నది గదా. అయ్యో! అప్పుడే యావాడికత్తితో నా కుత్తుక నుత్తరించుకొనియుండిన నాకీయావేదనాదుఃఖములు లేక యుండెడివేమో? నా పాపముకొంతకు గొంత నశించియుండెడిదేమో? చేయనైతిని. ఏదీ? చేయుట కవకాశమేదీ? గల్లున నేలబడగనే నేను సంభ్రమముచెందుచుండ [illegible]త్తిని ఆమహారాజు రివ్వునవచ్చి తీసికొనిపోయెను గదా. అయ్యో! ఎంతపాపిని! ఎంతమందభాగ్యను? ఆదివ్యసుందరవిగ్రహుని, ఆకమనీయక్రమగుణాలంకారుని, ఆ శాత్రవరాజన్యానేకపసింహమును, ఒకమాఱు కన్నులారచూడనైతి; నోరార బలుకరింపనైతి; చేతులార నమస్కరింపనైతి. ఛీ! ఎందులకీపాడుజన్మము ఎంతశీఘ్రముగా నసువులువాసిన నంత మేలుగదా! ఆఁ! ఆఁ! ఎంత పొరఁబడుచుంటిని? అసువులువాసిన నపయశ మెట్లుపాయును? ఆమహారాజునకును, ప్రజలకును, నాశీలమును ఋజువుచేయకుండ, నా విశుద్ధహృదయమును వెల్లడింపకుండ, నాగాఢానురాగమును విశదీకరింపకుండ,

ప్రాణములు వీడనా? వీడను. ఏమైనసరియే అపకీర్తిమా పుకొనకుండ నసువులవీడను నాప్రాణపతియెడగల నావి నిర్మలభక్తిని, విశుద్ధానురాగమును, నెన్నిదినములకైన వెల్లడించిరియే విగతజీవి నగుదును. లేకున్న నాయపయశము స్థిరమైపోవునుగదా! కాని నాయపకీర్తి యెటులు తొలగును. మరల వెళ్లి నాజీవితేశ్వరుని పాదములపై బడి ప్రార్థింతునా? ఎట్లు? ఈభటులు తమప్రభుని యాజ్ఞ నుల్లంఘించి మరల దోడ్కొనిపోవుదురా? ఒకవేళ నేవిధముగనైన వెళ్లెననే యనుకొనిన, భర్తృఘాతకినని విశ్వసింపుచున్న యాప్రభుడు నాకుదర్శన మొసగునా? వట్టిది! వట్టిది! అటులజరుగదు. పోనిమ్ము; కటకమున కేగి మాతండ్రిని దోడ్కొనివచ్చి మహారాజు దర్శనము చేయుదునా? పిల్లను దాసీపుత్రున కిచ్చి వివాహముచేసి వంశమర్యాదను గంగను కలిపితివని మాయమ్మ చేతను, అన్నలచేతను మునుపే సూదిపోట్లు తినుచున్న మాతండ్రి, నేనువెళ్లిన 'మంచిదిక్కడనే యుండు' మని యూరకొనునుగాని నన్ను విజయనగరమునకు దోడ్కొని వచ్చునా? ఒకవేళ మాతండ్రి యంగీకరించినను, కులముతక్కువవారితోడి సంబంధమయ్యెనని మహాదురభిమానముతో గింజులాడెడి మాతల్లియు, తోడబుట్టినవారు ఆయనను గాని నన్ను గాని, మరలవిజయనగరముమాటదల పెట్టనిత్తురా? లేదు. కాన అక్కడ కేగినచో మాతండ్రి మాట యటులుండ నేనైన మరల విజయనగరమునకు వచ్చుటగాని, నాభర్తను దర్శించుటగాని తటస్థపడదు. కాన కటకమున కేగినచో నాగతియేమి? దిగంతవిశ్రాంతకీర్తి శోభితుండగు కృష్ణదేవరాయలంతటిమహాప్రభుని జేపట్టియు నామరూపములులేక గజపతుల యింటిదాసినై జీవితశేషము గడపవలెను. పతివిడిచిన సతికి పుట్టినింటమాత్ర మేమాత్రపుపూజ్యతయుండును. రాచపుట్టుకబుట్టి వీరపుత్రినై, వీరపత్నినై అట్టినికృష్టపు బ్రతుకు బ్రదుకుటెంత నీచము! నీచపు బ్రదుకుకన్న చావు మేలు. ప్రాణత్యాగము సేసిన యీ మనోవ్యథలన్నియు దీఱును. కాని మఱియొకకర్తవ్యము నన్ను మరణోన్ముఖను గావింపకున్నదే? అకటా! ఏమిసేయుదును? ఎందుజొత్తును? పుట్టినింటి కేగ మనసులేదు. మహారాజునువర్శించి నిర్దోషిత్వము తేటపఱచి క్షమాపణ వేడక ప్రాణత్యాగము సేయుటయు, సమ్మతముగాదు. ఏమికర్తవ్యము! ఇచ్చటనే యుందునా? అవునవు నిదియే మంచియుపాయము. ఇచ్చటనే నిలిచి భర్తృచరణకమలధ్యానము సేయుచు జీవితశేషము గడపెదను. నాతండ్రియొసగిన వెలలేనిసంపత్తి నేనెన్ని ధర్మకార్యములు సేయుటకైన చాలును. నాప్రచ్ఛన్నవృత్తి కీయు నాగరకపుపల్లెయే తగును. కాని యీప్రదేశ మేప్రభు సీమలోనిదో కనుగొందును. లక్ష్మీ! లక్ష్మీ! ఈప్రదేశ మేప్రభురాజ్యములోనిది?"

"అమ్మా" నాయకు నడిగి కనుగొందును.

"అయ్యా! ఈస్థల మేప్రభురాజ్యములోనిది."

"మాప్రభురాజ్యమునిదే."

"అమ్మా! రాయలవారిరాజ్యములోనిదే యీ ప్రదేశమని సేనాపతి చెప్పుచున్నాడు."

"ఆహా! ఎంతపుణ్యుడు. కీడులో మేలు. నాపరదైవముదేనా యీపల్లె! లక్ష్మీ! మహాభాగ్యముగదే! నాప్రాణేశ్వరపాలితదేశమునందే నా కిరవు దొరకినది."

"లక్ష్మీ."

"అమ్మా!"

"పరివారము నిచ్చట యాపవలసినదని సేనాపతితో జెప్పుము. మఱియు నిచ్చటగల పల్లెపే రెద్దియో గూడ కనుగొనుము!"

"చిత్తము. అయ్యా! అమ్మగారిచ్చట నాగుటకు సమ్మతించిరి."

"చిత్తము."

"అయ్యా! ఈపల్లె పేరేమి?"

"చిన్న గొల్లపల్లె."

"అమ్మా, సేనాపతి యిక వెళ్లవచ్చునా?"

"వెళ్లవచ్చును. తమరాజధానికే వెళ్లవచ్చును. వారిసాయము మనకక్కఱలేదు. కాన ఉపకడలేచి పరివారసమేతుడై సేనానిని తమరాజధానికి వెళ్లుమని చెప్పుము."

"అమ్మా! వారిసాయ మిప్పుడేవిడనాడుకొని నచో నీదుర్గమారణ్యములను గడచి మనము సుఖముగా కటకమున కేగగలమా?"

"కటకమున కెవ్వ రేగదలచిరి?"

"వెళ్లకున్న మనకీసాంద్రారణ్యములో దిక్కెవరు?"

"ఈశ్వరుడు."

"దేవీ! సాహసమువలదు. దైవదుర్విపాకమువలన మహారాజు మిమ్ములను బంపివేసిరి. ఇక నాతడు మిమ్ము రావింపడు. అట్టిచో తలిదండ్రుల ప్రాపుననే గదా స్త్రీ యుండుట ధర్మము. అటుపతికడనుగాక, యిటు తలిదండ్రులకడను గాక రాజపుత్రికలగు తామి టు లొంటరిగ వసించుట భావ్యమగునా? ఏమిముప్పు వాటిల్లునో!"

"ఇప్పుడువచ్చిన ముప్పుకంటె మిన్నయైనదిరాదు."

"అమ్మా! అటులనరాదు. తరుణవయస్కవు, రాజ కుమారివి; అంతఃపురము వీడరాని సమయమిది."

"లక్ష్మీ, ఏంమల కీభీతి! రాచకన్నెల ధైర్యసాహ సము నెఱుగవా? వారు మానముకొఱకు ప్రాణము బలి పెట్టుదురు. శీలమువారికి ప్రాణపదము. కాదు కాదు. అంతకంటే అధికతమము."

"అవును తల్లీ!"

"అయినచో నిక భయమేమి? శీలవతియగు మాన వతికి ప్రాణము తృణము. కాని ఆమెపవిత్రతను, మృత్యు వుకొనిపోలేదు. అగ్ని కాల్చలేదు. కత్తియు త్తరింపలేదు. ఇంకపరుడా స్పృశించునది? శీలవతియగు క్షత్రియస్త్రీ అగ్నికన్న పవిత్రురాలు; ఖడ్గముకన్న నిశితురాలుకదా."

"అమ్మా! నేను మీ శీలమును శంకించుటలేను. ఇచ్చట వసించుట కష్టతరమని శంకించుచున్నాను."

"సీత దుష్టరాక్షసుల మధ్యనే వసించెను. నేను మానవులైన యీ పల్లెజనులకడ నుండజాలనా?"

"అమ్మా! నీధైర్యసాహసములనంతముగా నున్నవి."

"అగును. లక్ష్మీ! నేను నాప్రాణేశ్వరుని దర్శించి నా యపరాధమును క్షమింప వేడుకొనువఱకు నేనిందే వసింప నిశ్చయించితిని. కాన సేనాపతిని రేపు పరివారము తో తమనగరమున కేగవలసినదని చెప్పుము. మీలో నెవ్వ రెవ్వరుకటకమున కేగదలంచితిరో వారెల్లరు రేపేవెడలుడు. నేచేసిన పాపమునకు నా కీదుర్గమారణ్యవాసమే యుచిత మైనది. నాగరికులపొత్తునకు నేనుదగను. కాన లక్ష్మీ, చె ప్పుము; సేనాపతితో గట్టిగా జెప్పుము. మీ సాయము మాకక్కఱలేదనియు, మేమొంటరిగా నేగగలమనియు చెప్పుము. ఈయుత్తమాశ్వములను, నీభద్రగజములను వెంటగొని మీ రెల్లరు కటకపురి కేగుడు. నే నీజానపదు లతో గలిసి యీపల్లెయందు వసించెదను. మఱియు లక్ష్మీ! కటకపురిపరివారముతో నీవుగూడ మన దేశమున కేగుటకు సిద్ధమగుము. తెలిసెనా? ఈ ప్రుదయమగు సరికి విజయనగర కటకనగర పరివారజనములలో నెవరును నాచెంత నుండరాదు. ఇది నిశ్చయము."

"అమ్మా! నీ వింతదృఢనిశ్చయముతో నుండ నేనే మిసేతును? కాని దేవీ, నిన్నీయుగ్రారణ్యమున, నీ యనాగరికులనడుమ, విడిచిపెట్టి కటకమున కేగుదునా? ఎంతమాటంటివి? ఈ చెలి నిన్నెన్నడయిన యెడబాసి యుండ కంటివా? నిన్నెడబాయలేకనే గదా యీ ప్ర బంధువర్గము నెల్ల విడనాడుకొని యీ దూరదేశమున కే తెంచితిని. ఇట్టి నిన్ను అటు పెనిమిటి, కడనైనడింపక ఇటు పుట్టినింటికైన దోడ్కొనిపోవక యీయరణ్యమ ధ్యమున విడిచిపోదునా?

"లక్ష్మీ! పోయిన తప్పేమి? నీవిచ్చటనున్న మిగుల కష్టపడుదువు."

"మహారాజపుత్రివగు నీకులేనికష్టము నాకా?"

"రాజోచిత భోగములనెల్ల బుద్ధిపూర్వకముగా వర్జించితిని గాన నాకు కష్టములేదు."

"నీవువిడచిననాడే నేనుగూడ విడిచితిని."

"ఇనుమునుగూర్చి అగ్గికి సమ్మెటపెట్టా? లక్ష్మీ నిర్హేతుకముగా నీకిట్టిక్లేశమును గల్గించుటకు నామనసొప్ప కున్నది. కాన యీపరివారముతోపాటు నీవు కటకరా జ్యమునకు వెళ్లిపొమ్ము. నావిషయమై విచారింపకుము. దిక్కులేనివారికి దేవుడేదిక్కు; కాన నాకేమియు ప్రమా

దమురాదు; వచ్చినను మోసములేదు. నిందమోసిన యీ బొంది యెంతశీఘ్రముగ యిహమునుబాసిన నంతమేలు కాన లక్ష్మీ, తప్పక నీవు కటకమునకు పోవలెను."

"దేవీ! ఇట్టి దుర్భరకార్యమును నాపైఁ బెట్టకుము. చిన్నతనమునుండి మనమొకరినొకర మెడబాసియున్నవారముకాము. మేనులు రెండు; ప్రాణమొకటిగ వర్తించినవారము. అక్కడ చేయరాని యకార్యముచేసి మహారాజుచే నవమానకరముగ పంపివేయబడి, యిచ్చట దుర్గమారణ్యములో నిన్నువిడిచి, యీపరివారమును వెంటబెట్టుకొని తగుదునని నేనేమని కటకపురి కేగుదును? ఏ మొగము పెట్టుకొని మీతల్లిదండ్రుల జూతును? మా పుత్రిక సుఖియా యని యడిగిన మీ తలిదండ్రులకేమని సమాధానమిత్తును? అమ్మా! నావల్లగా దీపని. నీవున్న చోటనే నేనుందును. మన యీబాల్యస్నేహము తలచియైన దేవీ! నేను నీసన్నిధినే యుండుట కనుగ్రహింపుము. పరివారము పోవుట కనుజ్ఞనిమ్ము. కాని నేను మాత్రము పోను. నిన్నువదలిపోను" అని లక్ష్మీదేవి పాదములబట్టుకొని గగ్గోలుగా విలపించెను. దేవికిఁక కాదనుటకు సాధ్యము కాలేదు.

౪

నాగరికు లెక్కడ నివసించిన నదియే నగరమైపోవును. దేవి బసచేసిననాడు చిన్నపల్లెగా నున్న గొల్లపల్లెయత్యల్పకాలములో గొప్ప మహానగరమైపోయినది. దేవియాజ్ఞచే రాయలపరివార మామఱునాడే వారిని విడిచి చనెను. కాని దేవియందలి గాఢభక్తిచే నామె పుట్టినింటి పరివారజనులలో నొక్కరైన నామెనువీడి కటకమునకేగుట కంగీకరింపలేదు. కాన నాపరివారజనముల కా గజాశ్వముల కర్హములగు భవనములు, శాలలు, నిర్మించుట తప్పని సరియైనది. అమాయకులగు నాపల్లెజనులు చతురంగసేనలతో వచ్చి విడిసిన యాదేవిని తమపాలిటి దేవతగా దలంచి భవనములు కట్టుటకు, శాలలు నిర్మించుటకు, బావులు త్రవ్వుటకు దోడ్పడిరి. కోమటులు కొందఱు పసిపట్టివచ్చి దుకాణములు పెట్టిరి. శిల్పులు కొందఱు వచ్చి భవనములు నిర్మించిరి. వడ్రంగులు కొందఱువచ్చి దారుకృత్యములు నిర్వర్తించిరి. ఒకరేమి, రాళ్లుమోయువారు, సున్నముకాల్చువారు, బండ్లుతోలువారు. ఇటుకచేయువారు, వీరువారననేల సకలవృత్తులవారు వచ్చి యచట నివాసములేర్పఱచుకొనిరి. ఇవ్విధముగా చిన్న గొల్లపల్లె మహానగరమై పోయినది. ఆమందిరములలో కెల్ల తొలుదొలుత నిర్మింపబడినదే గొప్పధర్మశాల. ఆ ధర్మసత్రమునం దహర్నిశలేసమయంబున జనినను భోజనమునకు లోపములేదు. ఒక భోజనమేగాదు పాలువలయువారికి పాలు, నీరువలయువారికి నీరు, స్నానము వలయువారికి స్నానము, శయ్యలువలయువారికి శయ్యలు, యివియు నవియుననేల? నిష్ఠురపథశ్రమాకలితచిత్తులైయున్న బాటసారులకేయేసౌకర్యములు వలయు నవియెల్ల శ్రద్ధామతిసమకూర్చు నేర్పాటు లక్కడ విరివిగా జేయబడినవి. దేవియే దాని కధిపురాలు. లక్ష్మియేదానికి నిర్వాహకురాలు. పూర్వపశ్చిమములకు ప్రయాణముసల్పెడు పథికుల కాధర్మశాల కల్పవృక్షమైనది. ఆ మార్గమున ప్రయాణము సల్పెడు బాటసారులలో నొక్కరైన యాధర్మసత్రమున నిలిచి సత్కారమందకపోయెడివారులేరు. అంతయేకాక భిన్నమార్గముల బోవలసినవారు గూడ ఆసత్రపు సౌకర్యముల దలచి యీమార్గమునే పోవసాగిరి. ఇక జనులు శ్రీశైలయాత్రజేయు శివరాత్రి మున్నగు పర్వములయందాధర్మశాల కేవల మన్నపూర్ణనిలయమే! రేయుంబవళ్లు జరిగెడి యీ యన్నదానమునకు మేరయేలేదు. ఈ విధముగా ప్రజలకమూల్యోపకారము సేయుచున్న యీదేవి యెవరో యీపల్లెజనులకు గాని, యాత్రికజనులకుగాని తెలియదు. దేవియాజ్ఞచే నామె పరివారజనులలో నొక్కరైన యామె వృత్తాంతమునుగాని నామధేయమునుగాని యొరులకు దెలుపలేదు. కాన నిరంతరమన్నదానముసేయుటచే నన్నపూర్ణమ్మయనియు, కరివరదునివలె తమయభీష్టముల దీర్చుటజేసి వరదరాజమ్మయనియు, ప్రజలే యామెకు నామధేయములిడిరి. ప్రతిఫలరహితమైన యీ యపూర్వ సత్కారములును, ఆనిరతాన్నదానమును, ప్రజల కామెయందు మాతృభావమును, గలుగజేసినది. పల్లెల పట్టణముల నామె నామము వ్యాపించినది. స్వర్గమునుండి డిగినదేవతయని కొందఱు, పర్వత

కందరములనుండి యేతెంచిన యోగిని యని కొందఱు, యెవరికి దోఁచిన తెఱగున వారామెరాకకు కారణములు కల్పించియు, మహత్తు జొప్పించియు చెప్పుకొనసాగిరి. కాని నిరాడంబరయు, స్తుతివిముఖయు, పూతచరితయు, దానశీలయు, నిరంతరపతిపాదారవింద సందర్శన కుతూహలమతియై శ్రీవిష్ణుచరణకమలముల ధ్యానింపుచున్న రుచీదేవికీ ప్రపంచవార్తలే పట్టవు. ఎవరే పేరున బిలిచినను సరియే.

రుచీదేవియటనివాస మేర్పఱచుకొని కొలది సంవత్సరములు గడచినవి. ఆమె యసామాన్యవితరణమును, విశుద్ధజీవితమును, ధర్మానురక్తిని పాటలు పద్యములుగా నల్లి ప్రజలాబాలగోపాలము గానము చేయుచున్నారు. ఇంటింట యామె పేరుతో బాలికలు వెలసినారు, కాని యామెకీర్తిని వినినవారేగాని యామెను గనినవారు లేరు. ఆమెయన్నము తినినవారేగాని యామెపలుకులు వినినవారు లేరు. ఆపరివారగృహములకు నడుమ యాధర్మశాల కెడగా యామెనివాసమున కేర్పడిన దొక్కతృణకుటీరము. అందు భక్తగాథలేగాని ప్రపంచగాథలు వినరావు, విష్ణుకీర్తనమేగాని లోకకీర్తనము వినబడదు. భగవద్ధ్యానమేగాని భోగధ్యానము కనుపింపదు. ఆకుటీరముచుట్టు శ్రీవిష్ణుపూజార్హములగు తులసిమొక్కలే గాని యన్యములగు మొక్కలు కానరావు. మందారములేగాని మావిగున్నలగుపింపవు. పారిజాతసుమంబులే కాని యన్యసుమంబులు లేవు. ఆ దేవియొడలిపై నొక్క భూషణము లేదు. తెల్లని మేలుకమ్మిచీరయే యామెకు వెలలేని పట్టుచీరె. మాంగల్యమే యామెకు మణిహారములు. మట్టిగాజులే యామెకు రత్నకంకణములు. కుంకుమబొట్టే యామెకు కస్తూరితిలకము. ఆ దేవితృణకుటీరమున కెదురుగా నున్న దొక్కమందిరము. ఆ మందిరము సౌందర్యమునకుతావు; భోగములకు నెలవు; పరిమళంబుల కిక్క; ఆ రమణీయమందిరమున కనుదినము దేవి ప్రాతఃసాయాహ్నములందు వేళతప్పక దేవాలయమునకేగినట్టులేగివచ్చును. కల్యాణమందిరమని దేవి దానికి జేసిన నామకరణము. ఆ కల్యాణమందిరమున నేమి కలదో దేవికిని యామెప్రేమంపు చెలియైన లక్ష్మికిని దక్క యన్యులకు దెలియదు.

ౘ

సమస్తజీవకోటిని దురంతతాపంబున నలయించెడు నిదాఘసమయమే తెంచినది. వరదరాజేశ్వరి యశమువలెనే విస్తరించిన యామెనగరమున జలాభావమేర్పడినది. ఏ యొకటి రెండో తప్ప తక్కిన వాపీకూపతటాకాదు లెల్ల నెట్టిపోయినవి. సకలసంపత్సమృద్ధంబైన యానగరమున తగిన జలవసతిలేమి స్నానపానములకు జనులల్లాడుచుండిరి. జనులనీటియెద్దడినిజూచి వరదరాజేశ్వరి హృదయము సంతాపించిపోయెను. ఈ పురికి శాశ్వతమగు జలసమృద్ధి కల్గించుటెటులని దీర్ఘముగా యోచింప దొడగెను.

ఘనకార్యములు చేయదలచు వారికి వెఱవులు దొరకకుండునా? యోచింప యోచింప తన నగరమునకు మువ్వైపుల నాక్రమించియున్న కొండలపై వర్షించెడి జలము వ్యర్థముగా వాగులంబడి పోవుచుండెననియు, ఆజలమట్లు పోకుండ దట్టమైన కట్టవేయించినచో కొన్నిమైళ్ల వైశాల్యముగల గొప్పతటాక మేర్పడుననియు, దాన ప్రజలస్నానపానములకు నీటి కఱవుదీరుటయే గాక వేలయెకరముల భూమిని సేద్యముచేయుటకనువైన భూరిజలాశయ మేర్పడుననియు దేవికి దోచెను. తత్క్షణమే వేనవేలజనుల రావించి కొండకుదటగు నత్యున్నతమయిన కట్టను నాల్గవవైపున వేయించెను.

ప్రజలమానసముల నానందము తొలకరింపనా యేడు తొలకరి పూర్ణముగా చిందించినది. జనులమనమున సంతోషము ప్రపూర్ణముగా నూతనతటాకము జలప్రపూర్ణమై దేవిని, జనులనుగూడ సంతోషమున నోలలాడించినది. కాని పాపమా యానందమెంతసేపో నిలువలేదు. ఉత్తరక్షణముననే యొకమహావిపత్తువారి నెదుర్కొనినది. ఆకట్ట క్రొత్తదియగుటనో, కట్టుబడియందు దార్ఢ్యము తక్కువగుటనో మఱేకారణముననో, ఒకమూల గండిపడినది. తోడనే యాజలమెల్ల యాగండిని పడి వెలుపలకు ప్రవహింప సాగినది. నీరువెడలినకొలది గండి

పెద్దది కాసాగెను. క్షణములో నీవార్త పురమెల్ల పొక్కెను. జనులు తండోపతండములుగా గండిచుట్టు మూగిరి. ఆగండి నెట్టులైన పూడ్చవలెనని గొప్పగొప్ప గండశిలల దొరలించిరి. ఇంక నేమేమో చేసిరి. గంగా దేవికెన్నియో మ్రొక్కులు మ్రొక్కుకొనిరి. కాని గండిపూడలేదు. ప్రవాహవేగమున వారు వేసిన యడ్డు లెల్ల కొట్టుకొని పోసాగినవి. ఆపరిస్థితి నారసి "అకటా! మనమెంత దురదృష్టవంతులము! మనతటాకము పోసిమి యెల్ల 'ఇదిగో పసుపు అదుగో ముసు'గన్నటులాయెనే! అయ్యో, ఏమిచేయుదము! నిలిచిననీరెల్ల వాగులంబడి పోవుచున్నది. అయ్యో! గంగమ్మతల్లీ! మాయాసలెల్ల యడియాసలు చేసి వెళ్లిపోవుచున్నావా తల్లీ? మామీద నీకేల దయలేదు? మేముచేసిన యపరాధమేమి? నీటికై అవుచేత నల్లాడు నీదీనుల నేలకటాక్షింప"వని ప్రజలువా పోవ దొడంగిరి. తానుచేసినపని వ్యర్థమగుటయు, జను లల్లాడుటయుగని దేవియు నేమియుదోచక కాలుగాలిన పిల్లిచందమున వేదనపడుచు బహుభంగుల దేవుని బ్రార్థిం పుచుండెను. ఎవ రెన్నియత్నములు చేసినను కట్ట నిలుప లేదు. ప్రజలదుఃఖమును, దేవిసంతాపమును నగ్గలమైపో యినది. ఎవ్వడువున నీకట్ట నిలుచునని ప్రజలెల్లర కొకే యోచనయైనది. ఇంతలో నెవరుపుట్టించిరో కాని "గం గాభవానికి నరబలియిచ్చిన గాని కట్టపూడ"దను వాదుపు టినది. దుఃఖార్తులగు జనుల కావాక్యము చక్కగా మన స్సున నాటినది. 'నరబలి, నరబలి,' యనుమాట జనస మూహములో నొక్కమాఱు మ్రోగెను. అంతియేకాదు. ఒకముసలిదానికి శివముపూని యావాక్యమును కాయప ఱచెను. వెంటనే యావృద్ధస్త్రీ వింతగా నాట్యముచే యుచు దేవీసదనమున కేగెను. ప్రజలందఱటుల కల్లోల పడుచుండ దేవిమాత్రము శాంతముగానుండెనా? ఆమె దేవతామందిరమున నిశ్చలధ్యానపరమైయుండి "స్వామీ! ఆర్తరక్షామణీ! దీనజనచింతామణీ! ఈసేవకురాలిపై దయజూపవా? దప్పితీర్చుకొనుటకు పుడిసెడు నీళ్లులేక యల్లాడెడు నీయార్తులపై గరుణింపవా? ఓఆర్తరక్షా దక్షా! నీపాదకమలముల నుండి యుద్భవించిన గంగమ్మ తల్లి యిచ్చోట నొక్కింత నిలుచునటు లనుగ్రహింపుము. ననుగావుము. ప్రజలబ్రోవుము" అని దేవదేవుడైన నారాయణుని ప్రార్థింపుచుండెను. ఇంతలో శివముపె రిగిన వృద్ధురాలరుదెంచి "అమ్మా! నరబలి యిచ్చినగాని గంగమ్మ మనపురమున నిలువ ననుచున్నది కాన పెదకం బడు, చినకంబడు అని, నాకిరువురు కొడుకులు గలరు. వారిరువురు గంగకు బలియై కీర్తివంతులగుదురు. ఎన్నిదిన ములు జీవించినను మరణముతప్పునా? తనువు శాశ్వతము కాదు. తనువువలన ఆర్జించిన కీర్తిమాత్రము శాశ్వతమై యుండును. కాన వరదరాజేశ్వరీ, యనుజ్ఞ యి"మ్మని వాకిటజేరి మొఱవెట్టెను. దేవి కింకను ఆవార్త చక్కగా వినిపింపనేలేదు. ఆమె సమాధాన మీయనేలేదు. ఇం తలో అవృద్ధురాలు మరల గంతులువైచుచు గండివద్దజేరి "గంగమ్మతల్లీ, ఇదుగో నాపుత్రులు; వీరిరువురిని బలిగొని మాపురమున నిలువు"మని మ్రొక్కెను. వెంటనే పెదకం బడు చినకంబడు గండిలోనికి దూకిరి. ధణధణమని తప్పెటలు మ్రోగెను; భంభంమని బాకాలూదిరి. 'జయా గంగమ్మ! జయా జయా' యని యాబాలవృద్ధమొక్క మొగినఱచుచు వారిపయి పుట్టిగప్పిరి. చిత్రముగ గండిక ట్టువడెను. ప్రజలయానందము మిన్నుముట్టెను. ప్రజలీ విధముగా పరవశచిత్తులై తాండవింపుచుండ పూజావిధా నము ముగించినదేవి బలివృత్తాంతము విని కరుణార్ద్ర చిత్తయై 'గండిపూడకపోయిన మానె ప్రాణార్పణమునకు మాత్రము పాల్పడవల'దని వర్తమానమంపెను. అప్పటికే బలివిధానము జరిగిపోవుటచే దేవిసందేశమునిరర్థకమై పోయినది.

౬

నిఃస్వార్థమగు త్యాగమువలె మఱియెట్టి వితరణ మును శాశ్వతకీర్తి నొసంగజాలదు. కంబడుసోదరుల యాత్మార్పణచే నిర్మితమైన యా తటాకమునకు కంబము చెఱువనియు, నానగరమునకు కంబమనియు నామము స్థిరపడిపోయినది. ఇప్పటికిని నా చెఱువునకును గ్రామ మునకును నవియే పేరులు. ఆంధ్రదేశమునందలి జలాశయ ములలో కెల్ల కంబముచెఱు విప్పటికిని మిన్నయే. వరద రాజేశ్వరికి గండిపూడిన వర్తమానమును ప్రజలెఱుకపఱ

చిరి. బలివిధానమునకు కించగానున్నను, వారియాత్మార్పణమువలన కార్యము సానుకూలమైనందులకు మాత్రము దేవి మిగుల సంతోషించెను. వెంటనే తన యన్నపూర్ణనామము సార్థకంబగునటు లష్టాదశవర్ణములకు భూరిసమారాధనలు గావించెను. గంగపుత్రసంఘమును కంబముసోదరులకు వీరపూజలు గావించెను. మఱియు, "సతతము కృష్ణదేవరాయప్రభుని చరణారవింద సేవాతత్పరయగు నొక సాధ్వీరత్న మీ తటాకమును నిర్మించి యాప్రభూత్తమున కాయురారోగ్యైశ్వర్య కీర్త్యధికారంబులు పెంపొందునటుల భగవదర్పితంబు గావించె"నని యొకశిలాశాసనంబు వ్రాయించి యా తటాకంబు దరిని స్థాపింప జేసెను.

నిన్నమొన్నటివఱకు చిట్టెడునీరులేక పచ్చని పూరికేకలవై యూషరక్షేత్రముగా నున్న యాప్రదేశము పూర్ణమైన జలవసతి యేర్పడుటచే నత్యల్పకాలములో సస్యశ్యామలమై పోయెను. ఒకవంక ఫలవృక్షముల తోటలు, వేఱొకదిశ చక్కని పుష్పారామములు, మఱియొక చక్కని పచ్చని పైరులునై కంబపురి పరిసరమెల్ల నయనోత్సవకరమై క్రొత్తగ జూచువారికి నందనోద్యానమువలె మురువు గొల్పసాగెను. చక్కని జలవసతి నగరమున కపూర్వశోభయేగదా. ఆ సౌభాగ్యము నారసి వరదరాజేశ్వరి పొందిన యానంద మింతంతగాదు.

జలాశయము నిర్మింపబడి కొలది వత్సరములైనది. ఒక్కనాటి మధ్యాహ్నము రాయలు తమాశ్వమునధిరోహించి తటాకము పొంతవచ్చి నిలిచెను. ఆతడుధరించిన దుస్తులును, తాల్చినయస్త్రశస్త్రాది సాధనములును,చూడ నాతడుమృగయాక్రీడకరుదెంచెననితోచుచుండెను. మఱియు నాతని నలిగిన దుస్తులవైఖరియు, వాడినమొగమును, పొడమిన చెమటబిందువులును నాతడు వేటయందు మిక్కిలి శ్రమచెందిన చందమును వివరింపుచుండెను. ఆ రాజ వీరు డెవ్వడో యాగ్రామవాసులకు తెలియదు; కాని తేజస్వంతుడగు నాతని ముఖారవింద మారసి యాతడెవడో లోకోత్తర పురుషుడని మాత్ర మూహించి కుతూహలముతో జూడదొడంగిరి.

ప్రజలెల్ల రిటులు కుతూహలముతో గన నామహీపతి యా తటాకముచెంత గుఱ్ఱముదిగి యా చెఱువులోని శీతలజలముచే శ్రమదీర ముఖప్రక్షాళనము గావించుకొని కరచరణంబులు కడిగికొని యాజలాశయమువంక తేఱిపాఱ జూచి అశ్చర్యముచెంది. "ఆహా! ఏమి జలాశయము! మహార్ణవముబోలె నున్నదే. ఇంత గొప్ప తటాకమును ద్రవ్వించి యూషరక్షేత్రమును బోలిన యీ ప్రదేశమును సస్యాఢ్యము గావించిన మహాత్ములెవ్వరో పూజనీయులు గదా." అని యాశూరశిఖామణి యచ్చట నున్న వారిని గని "ఈ తటాకము నిర్మించిన దెవ"రని యడిగెను. "అయ్యా! ఎవరున్నారు? మా అమ్మ, మాకన్నతల్లి, అతిథి యభ్యాగతులును నిరతాన్న ప్రదానముచే పూజించు అన్నపూర్ణాదేవి, మా వరదరాజేశ్వరియే యీ తటాకమును నిర్మింపజేసిన యా మహాతల్లి యని వారు ఐకకంఠ్యముగా జబాబిచ్చిరి. ఆ మాట లాలించుటతోడనే యా భూపతి యాననమున నాశ్చర్యమేకాక లజ్జయు ద్యోతకమయ్యెను. తోడనే యాత డాయపూర్వజలాశయమును నిర్మించిన యా పుణ్యాత్మ యెవ్వరో, నిరతాన్నదానము గావింపుచున్న యాదానశీల యెంతటి సచ్చరితయో, ఆమె నిజ నామ మెద్దియో తెలిసికొనక నిజపురమున కరుగరాదని నిశ్చయించి "అయ్యా! నాకీపూట యీవీట వసియించుట కెక్కడైన వసతి లభించునా? భోజనము దొరకునా?" అని యా పౌరుల ప్రశ్నించెను. "అయ్యా! వేరు వసతిరే[illegible]? మాయన్నపూర్ణ సత్రమే యన్నిటికిని గలదు. మీవంటి మహనీయు లెందఱో యట నిత్యమును విడిసి సత్కృతులై చనుచుందురు. మీరును నటకరుదెంచుడు. మేము త్రోవ చూపుదు"మనిరి. అనిన 'వల్లె'యని రాయలు వారివెంట వరదరాజేశ్వరి సత్రమున కేగ నెంచి తటాకమునుండి వెలువడి గట్టునెక్క నచట దేవిచే ప్రతిష్ఠితమైన శిలాశాసనము గానవచ్చెను. అప్పుడాతనికి గల్గిన ఆశ్చర్యమునకు మేరలేదు. "నాచరణదాసిచే నీతటాకము నిర్మింపబడినటు లిందు వ్రాయబడినది! నాకు దెలియకయే నాచరణదాస్యము సేయుచు, నిరతాన్నదానాది ధర్మకార్యములు సేయుచు, సజ్జనస్తవనీయ చరితయు, యశోవిశా

లయున్నదై దీనజనకల్పకముగా నున్న యీసతీరత్నమెవ్వరు? ఇట్టియామె నెప్పుడును చూచినజ్ఞాపకమైన లేదు. నాకు చరణసేవ చేయునంతటి మహాభక్తి యీమెకు నాయం దేలయుదయించెనో, నారాజ్యమున వసింపుచు, నన్ను సేవింపుచు, నా దేశము సుభిక్షముగనుండెడి యిట్టి మహాత్కార్యముల గావించుచు నుండెడి యీసాధ్వీరత్నమును తెలిసికొనక తప్పానర్చితినిగదా” యని యోచించి రాయలు వరదరాజేశ్వరీ సత్రమున కొకబాటసారివోలె వెడలెను.

౭

ఎప్పుడును మానవులు ఆశాహతులు కాగూడదు. మనసారకోరెడు సంకల్పము లెప్పుడును సఫలములు కాకమానవు. అందును పవిత్రహృదయులగు వారి తపములెప్పుడును వట్టిపోవు. మహాసాధ్వియగు వరదరాజేశ్వరి యేవిభుచరణారవిందముల దర్శించి క్షమాపణవేడెడి భాగ్యమును ప్రసాదింపుమని నిరంతరము శ్రీమన్నారాయణుని ప్రార్థింపుచుండెనో ఆచిరంతనాకాంక్షితమును సాఫల్యపఱుప శ్రీమహావిష్ణువు సంకల్పించెను. లేకున్న యెక్కడో విజయనగరమున వసించెడిరాయలు వేటమార్గమున వచ్చుటేమి! కంబపురి చేరుటేమి! వరదరాజేశ్వరి కీర్తివినుటేమి! ఆమె ధర్మశాల కతిథి యగుటేమి! ఆశ్చర్యముగదా! మహారాజును గుర్తించినవారు పెక్కుమంది యచట నుండుటచే యాతడు కృష్ణదేవరాయలని తెలిసికొనుట కచ్చటివారి కెక్కువకాలము పట్టలేదు. కాన వెంటనే కొందఱు స్త్రీ లతిథి పూజాగ్రవస్తుసమితితో నాతని నెదుర్కొనిస్వాగతంబిచ్చిరి. తత్క్షణమే యొకస్త్రీ మహారాజు మజ్జనమునకు పరిమళభరిత నీరమును సిద్ధముచేసెను. వేఱొక స్త్రీ రమ్యకౌశేయముల గట్టనిచ్చెను. మఱియొకతె షడ్రసోపేతములగు వంటకముల నాయత్తపఱచెను. ఇంకొకతె వడ్డించెను. మహారాజు భుజింపుచుండ నింకొకవెలది వీవనచే శ్రమదీఱ విసరెను. అకాలములో ఆనాడు కల్యాణమందిరపు తలుపులు దీయబడినవి. అచ్చటనే మహారాజు సేవించుటకు విడెమును, శయనించుటకు శయ్యయు సిద్ధముచేయబడెను. “స్వామి! ఇటిటని” స్త్రీలు మందిరమునకు త్రోవజూప భోజనానంతరము మహారాజందు ప్రవేశించెను. “ఆహా! ఏమి యీమందిర రామణీయకము! ఎక్కడ జూచిన శిల్పుల యనల్ప శిల్పకళావైదగ్ధ్యమే! ఎక్కడ చూచిన నిలువుటద్దములే! ఎందు గనిన చిత్తరువులే! వెండికంబములు! పైడిపూతలు! రత్నములకూర్పులు! అహో, ఆమందిరవైభవ మసదృశముగదా! మహారాజామందిర రమణీయతను గనినంతనే యాశ్చర్యముగ్ధుడై నిలువబడెను. విడెము సేయవలెనని వేడ్కగలుగలేదు. శయనింపవలెనను నిచ్చ పొడమలేదు. ఆమందిర రమణీయతను, ఆచిత్తరువుల సొంపును సవిమర్శకముగ వీక్షింపవలయుననెడి కుతుకమే యాతని కెక్కువయ్యెను. మహారాజు చిత్తరువుల చూడసాగెను. ఏమిచిత్రము! అవియన్నియు నాతనివే! “అహో! ఇదియేమి? మాయయా! ఇంద్రజాలమా! పరమాద్భుతముగా నున్నదే! ఏపటము చూచిన నాయాకృతినే ప్రతిబింబింప జేయుచున్నదే! ఇవి అద్దములు కావుగదా! కావు కావు. నేను నిలువబడి చూచుచుంటిని. ఇందుకూర్చుండినవి, పండుకొనినవి, అశ్వారోహణము చేసినవి ఆదిగాగలవి పెక్కు లున్నవి. ఇవి ప్రతిబింబము లెటు లగును? కాని నాచిత్రములెవరో నిపుణులగు చిత్రకారులు వ్రాసియున్నారు. ఆహా! ఈ చిత్తరువు లెంత యథాతథముగ చిత్రింప బడినవి? నిజముగా నీచిత్రకారులనైపుణ్య మసదృశము. వేలకువేలు బహుమానము లొసగి ఎందరో చిత్రకారులచే నాచిత్తరువులు వ్రాయించియుంటిని గాని యవేవియు నింతరమణీయముగ లేవు. కాని యీధర్మశాలయందు నాయీచిత్తరువు లుండుటకు గారణమేమో! వీనిని రచించినవారెవ్వరో యూహింప నశక్యముగా నున్నది. మఱియు నీచిత్తరువు లమర్చిన చట్రములుగూడ కొలదివిలువ కలవి కావు. ఈనెలలేని దంతము! ఈజిలుగు నేత! ఈబంగారుపోదుగు, ఈరత్నముల కూర్పు! ఒక్కొక్కదానికెంతధనము వ్యయమైయుండును! కాని నారూపపటముల కింత సన్మాన మెందులకు? ఈదేశపు ప్రభువునని యేనా? కాదు కాదు. రాజగౌరవము దెలుపుట కిన్ని చిత్తరువు లెందులకు? ఒకటి చాలును; రెండుచాలును; కాని యిన్నియా? లేదు. ఇందు రాజభక్తికన్న నధిక

ముగా ప్రస్ఫుట మగుచున్నది ప్రణయరక్తి. కాని యిచ్చట నాయందిట్టి యపూర్వానురాగమును భక్తిని వెల్లడించుచున్నవా రెవ్వరు? ధర్మశీలయగు వరదరాజేశ్వరియే యిటుల గావించియుండునా? ఛీ, ఛీ! ఏమి నామతిహీనత! ఆమె యెవ్వరు? నే నెవ్వరు? పరపురుషు డనగు నాచిత్తరువుల నేల యామె తనమందిరమున ప్రతిష్ఠించుకొని యుండును? లేకున్న నాకీయెడ నపూర్వప్రాప్తిన పూజ్యత లెందులకు? ఈ వరదరాజేశ్వరి యెవరో విన్న పేరు గాదు. కన్న మనిషి గాదు. ఆమె పూర్వవృత్తమునుగాని, యామె నిజనామధేయమును గాని తెలిసికొన వలయునన్న నిచ్చట నొకరైన తెలుపువారు కానరాకున్నారు. కొందఱు అన్నపూర్ణమ్మయని, కొందఱు వరద రాజమ్మ యని, యిరుతెరగులుగా జెప్పుచున్నారు. ఇందులో నేది యామె నిజనామము? లేక యీరెండును గాక వేఱొకన్నే రైన నామెకు గలదేమో! ఏమియు తెలియకున్నది. పౌరులవలనగాని, పరిజనులవలనగాని యీమెవృత్తాంత మెఱుగుటకు సాధ్యముకాదు. కాన ఈచిత్తరువుల వలననే యామెవృత్తాంత మేమైన గ్రహింపవలెను." అని మహారాజు మరల సవిమర్శకముగ తనచిత్తరువుల నొకటియు బీరుపోకుండ చూడసాగెను. ఇటుల చూడం జూడ నొకచో నొకస్త్రీ దీనయై తన చెంత నిలిచి ప్రార్థించుచుండినటులు, వేఱొకచో తాను కృపాణధారియై తీవ్రదృక్కుల బఱపుచు నిలువబడి యుండ నొకస్త్రీ నేలబడి మహావేదనతో దురపిల్లుచున్నటులు, మఱియొకచోట నొక లేఖను దీసి చదువుచున్నటులును, ఆలేఖయం దీశ్లోకములును వ్రాయబడి యుండెను:

శ్లో. చరన్వనాంతే నవమంజరీషు
న షట్పదో గంధఫలీ మజిఘ్రత్,
సా కిన్న రమ్యా సచ కిన్న రంతా
బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా. ౧

శ్లో. మా కింశుక! ప్రకట యాత్మ నిమేషమాత్రం
మన్మస్తకే విహరతీతి మధువ్రతోయమ్,
కిం మాలతీ విరహవేద నయా త్వదీయం
దృష్ట్వా ప్రసూన మచిరా దనిలభ్రమేణ. ౨

శ్లో. భ్రమర భ్రమతా దిగంతరాళే
క్వచిదాస్వాదిత మీక్షితం శ్రుతంవా,
వద సత్య మపాస్య పక్షపాతం
యది జాతీకుసుమానుకారి పుష్పమ్. ౩

శ్లో. కుసుమాని లిఖంతు నామ చిత్రే
కతిచిత్కారు విశేషరూఢ శిక్షాః,
సురభి త్వ మమూని కిం లభంతే
కిము చైతేషు రసం పిబంతి భృంగాః. ౪

శ్లో. కిం మాలతి మ్లా యసి మాంవిహాయ
చుచుంబ తుంబీకుసుమం షడంఘ్రిః,
లోకే చతుర్భిః శ్చరణైః పశుః స్యా
త్స షడ్భిరత్యర్ధపశు ర్న కిం స్యాత్. ౫

"ఆహా! ఏమికవిత! ఈ శ్లోకము లైదును నైదనర్ఘరత్నములేగదా ఆహా! ఎంతభావగర్భితముగ నున్నవి! ఎంత మనోజ్ఞముగ నున్నవి. ఒకానొక స్త్రీ భర్తృతిరస్కృతయై పరిత్యజింపబడి యానాథుని యనుగ్రహప్రాప్తికై పరితపించుచుండుట యీశ్లోకముల భావముగా నున్నది. ఆభర్తను నే నగుట గాబోలు నాచిత్తరువునం దీ శ్లోకములు పొందుపఱుపబడియున్నవి. ఆహా! ఏమి యీ స్త్రీబుద్ధికౌశలము! చిత్రరచనమునందును కవిత్వమునందును నసమానమగు విన్నాణ మున్నటులున్నదే! అయినను నీమె యెవ్వరు? ఓహో! తెలిసినది తెలిసినది. చిత్రములగాథయు, శ్లోకముల భావమును, నా సంబంధమును జూడ గజపతి రాజపుత్రిగాథ యొకింత జ్ఞాపకమునకు వచ్చుచున్నది. ఆమె యీమె కాదుగదా. ఎటులగును? ఈమె పేరు అన్నపూర్ణయట, వరదరాజేశ్వరియట. ఆమెకు తుకాదేవియనియు, రుచీదేవియనియు రెండునామము లున్నటులు వింటిని. అయినను ఆమెను పుట్టినింటికి బంపితినిగదా. ఆమె యిచ్చట కెట్లు వచ్చును? ఏమియు దోచకున్నది. అప్పాజీ కెఱిగించినగాని దీని నిజవృత్తము తెలియబడదు."

మహారా జిట్లు యోచింపుచుండ సూర్యుడు పశ్చిమమునకు మరలెను. ఎండవేడిమి తగ్గెను. డోలాందోళితచిత్తముతో నున్న రాయలు దవ్వులనున్న పరివారమును గలిసికొన నశ్వారూఢుడై వెడలిపోయెను.

## ౭

"ప్రభూ! ఆమె నిశ్చయముగా గజపతిరాజ పుత్రియే. నా డామెతో వెడలిన సేనాపతిని నేనువిచారించితిని. వా రామె నిప్పుడు నిలిచియున్న తావున నే విడిచినట్లు చెప్పుచున్నారు."

"అటులైన అప్పాజీ! ఆమె నెటులైన మన నగరికి దోడ్కొనిరావలెను. నాకై యవ్విధి నల్లాడెడు సాధ్వి నింకను నుపేక్షించుట న్యాయముకాదు. కాని అప్పాజీ! ఇట్టి సాధ్వీరత్న మా నాడు శయనాగారమున సంగుప్త కృపాణయై యుండు టేలనో, అది యామె స్వయంకృతాపరాధమో, పరప్రేరణమో తెలియదు."

"చిత్తము; దేవర కా విషయమునగూడ సందేహము నివృత్తియగునట్లు చేసెదను. ఆవిషయమున తమశంకా నివారణచేసికొనిన వెనుకనే యామెను పరిగ్రహింప వచ్చును; కాని దేవరవారు నాతోగూడ ప్రచ్ఛన్నవేషముతో నటకరుదెంచుట కనుమతింపవలెను."

"అప్పాజీ! అట్లే. రేపు వేగుజాముననే కంబపురి కేగుదము. గమనవేగముగల యుత్తమాశ్వముల పయనమున కాయత్తముసేయ నేర్పాటు చేయుడు."

"చిత్తము."

ఏర్పాటుప్రకారము మఱునాడు వేకువ రాయలు, తిమ్మరుసుమంత్రియు నశ్వారూఢులై ప్రచ్ఛన్న వేషముతో వరదరాజేశ్వరి నగరమున కేగిరి.

## ౮

కంబపురిలో వరదరాజేశ్వరి యుదయము రెండు గడియలప్రొద్దువేళ తనకుటీరాంతర్భాగమున నేదియో కార్యనిమగ్నయై యుండ, నొక పరిచారిక అరుదెంచి "అమ్మా, కటకపురినుండి యొక యోధు డొకజాబును గొని వచ్చి తమతల్లిగారు వ్రాసిన యా జాబును తమ కందజేయుమని కోరుచున్నాడు. 'మా యమ్మగారు తీసుకొని రమ్మనిన తీసుకొనివెళ్లును నుండు'మని యాతని నంద నిలిపి తమసన్నిధి కరుదెంచితిని. ఏమని యాజ్ఞ" యనెను.

"మాతల్లిగారి తావునుండి వచ్చినది గావున నవశ్యము దాని జూడవలెను. ఆ యుత్తరమును వెంటనే తీసికొని ర"మ్మని దేవి యాతురతతో బల్కెను. తత్క్షణమే యా దాసి వెలుపలి కేగి యా కమ్మ నందుకొని తెచ్చి దేవి కర్పించెను. దేవి యాజాబును విచ్చి యిట్లు చదువుకొనెను:

"చిరంజీవి సౌభాగ్యవతియగు నస్మత్తనయామణి యగు రుచీదేవికి మీ యమ్మ దీవించి వ్రాయునది యేమనగా,—

"కుమారీ! నీవు భర్తను సంహరించు కార్యములో విఫలవైనను, కులహీను డగు నాదాసీపుత్రుని పొత్తుచేయక మనరాచమర్యాదను వంశగౌరవమును, నిల్పి ఆత్మగౌరవముగల వీరక్షత్రియ కన్యకకు నుచితముగు తెఱంగున ప్రవర్తించినందులకు నేనేగాక మన నిఖిలబంధువులును కడుంగడు సంతసింపుచున్నారు. కాని కుమారీ! ఆతడు పంపివేసిన వెంటనే సగౌరవముగా మననగరమునకు రాక యాతని రాజ్యములో వసించుటమాత్రము యుక్తముగ లేదు. నిను కడుగారాబమున ప్రోవగల తల్లిదండ్రులము జీవితులమై యుండ, నీవాయరణ్యములయందు సిలుగుల బడనేల? నీయునికి వినినదాది నాకు చాల దుఃఖముగా నున్నది. కాన ఈ జాబు చూచిన తత్క్షణమే సపరివారముగ నిటకు తరలిరాగోరెదను. ఏమాత్ర మాలస్యము చేయవలదు.

ఇట్లు నీ యాగమనము కోరుతల్లి,

"గజపతి మహారాజ్ఞి."

ఆ యుత్తరము చదివినతోడనే దేవికి కోపము విషాదముకూడ గల్గెను. కన్నీరుపైటచెఱగున నద్దుకొనుచు, "లక్ష్మీ! కలము కాగితము నిటకుదెమ్ము; మా యమ్మ పేర నిప్పుడే యొక కమ్మ లిఖించెద"ననెను. లక్ష్మి వెంటనే కలము కాగిత మందీయ ప్రత్యుత్తర మిట్లు లిఖించెను.

"మహాలక్ష్మీ సమానురాలగు శ్రీ శ్రీ శ్రీ తల్లిగారి పాదపద్మములకు తనుకొమరిత రుచి యనేకసాష్టాంగ దండప్రణామములు చేసి చేయగల విన్నపములు"

"అమ్మా, నీవు ప్రేమతో వ్రాసి పుత్తెంచిన లేఖను వందనములతో నందుకొని చదువుకొంటిని, కాని

నీవు కోరినట్లు కటకపురికి రాజాలనందులకు క్షమింప కోరెదను. తల్లీ, దైవజ్ఞులు చెప్పినట్లు నేను మహారాజునకు పత్నినైతిని. కాని నాయభాగ్యమునజేసి నీవు చేసిన దుర్బోధలు నాజీవితమును నీచాతినీచముగ జేసి వైచినవి. నా సౌఖ్యామృతమున చే జేత నేనే మట్టికొట్టికొంటిని. నీచెడుబోధలచే నానిర్మలమానసమును కలుషితము గావింపనున్నచో దాసికై జారును నా మొలయందు దోపుట కంగీకరించియుండను; భర్తృవధ కాయత్తనై యుండను. మఱియు నా జీవితముగూడ నిట్లు దుఃఖభాజనమై యుండక మహాసుఖభోగవిరాజితమై యుండును. నీయొక్క చెడుసలహాచే నా చేసినదుశ్చేష్టిత మా మహారాజు సన్నిధిని తనంతబయల్పడెను. ఉదారగుణాకరుడగు నా ప్రాణేశ్వరుడా క్రూరకర్మమును కనులార గాంచియు నా కెట్టికీడును నేయక సగౌరవముగ వీడ్కొల్పెను. ఆహా! ఏమి యా మహాప్రభుని సౌశీల్యము! మఱియు నాభర్త కులహీనుడని వ్రాసితివి. ఉత్తమక్షత్రియులగు సాగివారివంశమున నుద్భవించిన నాగమాంబతనయుడు కులహీను డెట్లగును? పూర్వము మాయత్త తనసవతితో నోడినవారు గెలిచినవారి కాఱు నెలలు దాసీత్వము చేయునట్లు పందెమిడుకొని, యాడినచదరంగపాటలో యోడుటచే మాయత్తగారికి దాసియనువాదు పరిహాసముగావచ్చెను. కాని తుళువాన్వయాంబుధి రాకాశశాంకుడగు కృష్ణదేవరాయ భూపతి దాసీపుత్రుడు గాడు. అమ్మా! మనయెఱుకలేమి నా కిట్టిపాట్లకు గారణమయ్యెను. నాపాపఫలము నే ననుభవింపుచున్నాను. ఎట్టివారికైన ప్రారబ్ధ మనుభవింపకతీఱదు గదా. తల్లీ! కటకమునకు రమ్మంటివి. నేనును నొకరాజపుత్రినై యుండి యిట్టి నీచస్థితియందు కటకపురి కెట్లు రానేర్తును? కాన సాళువాన్వయ క్షీరపారావారరాకాసుధాకరుండును, వినయవివేకాద్యనేక క్రమగుణాలంకార శోభితుండును, పరిపంథిరాజన్యానేకప సింహుండును, సురుచిర సుందరాకారుండును, కవిజనకల్పకమును, నర్థిజనచింతామణియు, దయాసముద్రుడును నగు నా ప్రాణేశ్వరు పాదపద్మముల ధ్యానింపుచు నే నిందే నాజీవితము గడపెదను. నాపాపకృత్యమున కిదియే తగుశిక్ష. తల్లీ! యీమాత్ర నింక మఱచిపొమ్ము.

ఇట్లు తమవిధేయ పుత్రిక,
రుచి."

ఈరీతిగా జాబు వ్రాసి యాయోధున కొసంగి, యిష్టమృష్టాన్నములచేతను, నమూల్య బహుమానములచేతను నాతని సంతుష్టిపఱచి పంపివేసెను.

౬

కటకపురి భటవేషము దాల్చిన యావిజయనగర యోధుడు వేవేగ వెడలి ప్రచ్ఛన్నవేషులై పురబాహ్యమున నిలిచియున్న రాయలకును, నాతని మంత్రివర్యుడైన తిమ్మరుసుమంత్రికిని నా లేఖ నందించెను.

ఆయుత్తరము చూచుటతోడనే రాజమంత్రుల కిరువురకును విషాదాశ్చర్యము లొక్కమాఱుగ నొదవి యొక్కింతసేపు చిత్రప్రతిమలైరి. అంత వృద్ధామాత్యుడు ప్రభుని గని "ప్రభూ! చూచితిరా ఆమెసౌశీల్యము! యథార్థమున కామె నిరపరాధ. తల్లిదుర్బోధలు, దాసీ దుస్తంత్రములు నామెను చెఱచినవి. లోకములో సత్యాసత్యముల నిరూపణ మిట్లుండును. అపరాధులు విడువబడుదురు. నిరపరాధులు దండింప బడుదురు. రాజేంద్రా! తమచే పరిత్యజింపబడియు, ననవరతము మిమ్మే ధ్యానింపుచు, పూజింపుచు, ఆ మహాసాధ్వి యెట్లు దుగపిల్లునో కనుడు. పాప మికనైన నాసతీరత్నమును తమరాజ్ఞిగ గైకొని యామెయార్తి బాపుట ధర్మము."

"అప్పాజీ! నాకును నట్టి కౌతూహలము కలదు. కాని యింతకాలమునుండి యామె నుపేక్షించిన నాకామెతోడి సమాగమమనిన బిడియముగ నున్నది. కాన నీవు ముందామెతో ప్రసంగించి యామెకు మనరాజధానికి రా మనసు గలదో లేదో కనుగొనుము. ఆమెహృదయ మెఱుగక ముందుగా నేనే వెడలుట లాఘవముగదా."

"మహారాజా! చక్కగా సెలవిచ్చితిరి. మీరు ముందుగా నేగుట మంచిది కాదు. కాన నే నమాత్యోచితమగు

శివితో నామెసన్నిధి కేగెదను. మీరు నామిత్రులట్లు నావెంట రావలెను."

వృద్ధసచివు డిట్లు హితము గఱప మహారాజు సమ్మతించెను. అంత రాజమంత్రు లిరువురు వరద రాజేశ్వరి యాలయమున కేగి ద్వారాంతికమునగల పరిచారికలతో 'కర్ణాటాంధ్రావనీ పతియగు శ్రీ శ్రీ శ్రీ కృష్ణదేవరాయరాజేంద్రులవారి ప్రధానామాత్యులు శ్రీ తిమ్మరుసుమంత్రులు వారు దేవిగారి దర్శనము చేయ నేతెంచిరని తమభృత్యునిచే చెప్పించిరి. పరిచారిక దేవి కావర్తమాన మెఱింగించెను. దేవి యపరిమితానంద భరితురాలై సగౌరవముగ వారిని దోడితెమ్మని వార్చెను.

దేవిగారి యాజ్ఞచే తిమ్మరుసుమంత్రి సగౌరవముగ దేవిగారి కుటీరాభ్యంతరమునకు ప్రవేశపెట్టపడెను. లోన దేవి, ఈవల తిమ్మరుసుమంత్రి; వారిరువురికి నడుమ నొకదట్టమగు తెఱ. మంత్రివర్యు నుత్తమాసనాసీనుం గావించి పరిచారికలు శ్రమదీఱ వీవనతో విసరుచు, కొండపటమున కావల నమ్మగారు గలరనియు, మీరు మాటాడవచ్చుననియు విన్నవించిరి. అంత తిమ్మరుసుమంత్రి యా తెఱవంక గాంచి, "అమ్మా! నీవు మాతల్లివి, మేము మీతనయులము. తనయులసన్నిధిని తల్లికి మఱుగా," అనెను.

"మీరు నాకు పితృసదృశులు. నేను మీకు పుత్రీతుల్యను. కాని రాజమర్యాద నవలంబింపవలసివచ్చె" నని దేవి నెమ్మదిగాను బల్కె.

"తల్లీ! అటులైన మన కీయరమర లెందులకని తిమ్మరుసు తటాలున తెఱ తొలగద్రోసికొని దేవిసన్నిధి కేగి, "అమ్మా, మీరు విజయనగరమున కరుదేరవలయును" అనెను. అమ్మాటలు వినినతోడనే గతాగతములు మదికి దోచి విషాదానందము లొక్కుమ్మడి కలుగజేయ, నశ్రుపూర్ణలోచనయు, గద్గదస్వరయునై దేవి "ఈదీనురాలట్టి సన్మానమునకు తగునే! తండ్రీ!" అనెను.

విరాగసూచకమైన దేవి నిరలంకారాకృతియు, దయనీయములగు నామెవచనములును కనుటతోడనే మంత్రివర్యునకు మితిలేని దుఃఖ మొదవెను. కాని ధీరుడగుటనాత డాదుఃఖమును నెమ్మెల్లో సంబాళించుకొని, తల్లీ! కష్టసుఖములు దైవదత్తములు. సంచితార్థ మనుభవింపక యెట్టివారికిని దీఱదు. మా సార్వభౌముడు మీ సౌశీల్యమును గాంచి, మీ భర్తృసేవాతత్పరతనుగ్రహించి, మీనిరపరాధిత్వ మెఱింగి, తాను మీయెడ మున్ను చేసిన తిరస్కృతికి పశ్చాత్తాపతప్తుడై యిపుడు మిమ్ము దనయంతఃపురమునకు దోడ్కొనిపోవ నువ్విళులూరుచున్న వాడు. తొలుదొలుత కటకపురమున మీరూపపటమును గాంచినది మొదలు మారాజేంద్రునకు మీయందుగల కూరిమి చెప్ప శక్యముగాదు. కాని పరస్పరప్రేమప్రకటనములతో నభిమత సౌఖ్యమరీచికల నుయ్యాల లూగవలసిన శయనాగారమున కఠిన కృపాణధారిణివై యుండుటయు, శత్రుపుత్రిక వగుటయు గని మామహారాజు శంకించి మిమ్ము వీడ్కొలుపవలసె. మీ వధోద్యోగమునకు కారణముపరప్రేరణమని యరయలేక, మహాసాధ్వివగు మిమ్మమర సౌఖ్యమును గూర్చు నమృతమని యెఱుగక హాలాహలముగా భావించి యెడమకాల దొలగద్రోచె. ఆ యవిచారకృత్యమునకు మా మహారాజిప్పుడు వొందుచున్న సంతాపమును తల్లీ, వివరింపనేరను. మీ ధర్మశాల కతిథియై వచ్చి మీరు రచియించిన చిత్తరువులు, శ్లోకములు గనినదాది మాప్రభునకు రేలు సుఖనిద్రలేదు; పగలు భోజనము నఱగోఱయే. కాన మహారాజ్ఞీ, నావెంట విజయనగరమున కరుదెంచి పరితప్తమానసుండగు నీ ప్రాణేశ్వరుని చిత్తము సంతోషాయత్తము గావింప వేడెద."

తిమ్మరుసు ఇట్లు పలుక గత వృత్తాంతము స్మృతికి వచ్చి రుచీదేవికి పట్టరాని దుఃఖ మొదవెను. కాన నవ్వారిగా వెడలెడి కన్నీటిధారల పైటచెఱగున నద్దుకొనుచు, "అయ్యా! నేను నేటికి ధన్యను, నా చిరతపఃఫలము ఫలించినది. నా ప్రాణనాథుడు నా నిరపరాధిత్వ మెఱిగి నా నేరము క్షమియించె నంటిరి. నా కదియే చాలును. నేను భర్తృద్రోహము చేసిన పాపాత్మను. ఆ జన్మమిటనే యుండి నాపాపఫలమును నేననుభవింతును. ఏకాంత భర్తృచరణధ్యానైకవృత్తిచే దక్క వేఱొకట నాపాప మపశమింపదు. పతిరాజ్యమున వసించుటయే

నాకు భర్తృసాన్నిధ్యమున నుండి నంతటి సంతోష కరము. నాయపరాధమును నా పెనిమిటి క్షమించె ననెడి చల్లనిపలుకే నాకు సమస్తసౌఖ్యములు; నా కదియే పదివేలు. భోగభాగ్యములు నా కేనాడో దూరమైనవి. ఆనాడట్లు సకలజనులచే భర్తృ హంతకినని దూషింపబడి నేడు నే నేముని విజయనగర మున కేతెంతును? చితికినముత్యమునకు నే? చేసినయకృ త్యము మాయునే? కాన నావంటి పాపాత్మ కేకాంత వాసమే యోగ్యమైనది. కాని నాప్రాణేశ్వరునకు నాపై నిండారు దయ గలదేని యొక్కమాఱు దర్శనమొసంగు డని కేలు మోడ్చి విన్నవించితినని యారాజేంద్రునకు నావేడికో లందజేయుడు. తండ్రీ! నా కదియే పది లక్షలు" అని కన్నీళ్లు చెక్కిళ్లపై జాఱుచుండ తలవం చెను. అంతవఱకు యవనిక మఱుగున నుండి యామె సం భాషణమును వినుచున్న రాయలాసమయమున స్వస్వరూ పముతో నటకరుదెంచెను. రాయలవారి రాక గని తిమ్మ రు సటనుండి తొలగిపోయెను. దుఃఖనిమగ్నయై తల వాల్చియున్న దేవి యారాకపోకలే గమనింపలేదు. కాన తిమ్మరుసే యట నుండెననుకొని, అయ్యా! నా కిక నేకోర్కెయు లేదు. నాప్రాణేశ్వరుని దివ్యమంగళ విగ్రహము నొకమాఱు కనులార గాంచి యామహాపురు షుని పాదాబ్జముల కొకమాఱు మనసార నమస్కరించి యాసదయహృదయుని పాదకమలములను నాయనుతా పాశ్రువులచే కడిగి నాచేసిన యకృత్యమునకు క్షమాపణ వేడికొనుటకు మాత్ర మొకమా అనుగ్రహింపుడని మాత్ర ము విన్నవింపుడు. ఆమహారాజందుల కంగీకరించెనేని నా కదియే జన్మసాఫల్యము; అదియే నాపరమావధి; అదియే నా చిరంతనవాంఛ. ఆమహనీయున కివే నాసా ష్టాంగనమస్కృతులు" అని చేతులు జోడించి దుఃఖవివ శయై సాష్టాంగముగ నేలపడెను. ఆమె దుఃఖస్థితి కన లేని కనికరము గలవాడై రాయలు తటాలున నామెను దనరెండుచేతులబట్టి లేవదీసి సాదరంబున నక్కున జేర్చు కొని "సతీరత్నమా! నేను రాయలను, నీ ప్రాణేశ్వరుడ" నని పల్కుచు, యోడకవెడలెడి యామె కన్నీటిధారల దన కొనగోళ్ల జిమ్ముచు, దేవీ! "నీయం దట్టి యపచార మొనర్చితిని! నీకడ నానాడు కత్తియుండుటకు గార ణము పరప్రేరణమని తెలియకపోవుటయు, చూచినపు డైన నిన్నడుగక పోవుటయు, నిన్ను పురినుండి వెడలగొట్టిన దాది నీవే మైతివని నీవృత్తాంతమే యారయక పోవు టయు నాదిగాగల నేరములన్నియు నాయందే గలవు. నీవు నిరపరాధవు; నేను సాపరాధుడను. నీవు నన్ను గాదు, నేను నిన్ను వేడికొందును. నన్నేలుకొనుము. నారా జ్యమున కేతెంచుము" అనెను. అమృతరసాయనంబుల బోలు నావాక్కుల వినినంతనే దేవి యానందకందళిత హృదయారవిందమై కను విచ్చి ప్రాణేశ్వరునిగని యాతని పాదములపై వాలి "నాథా! నాతప్పులు క్షమించితిరా! క్షమించితిరా! అహో! ఎంతధన్యను! ఎంతధన్యను!" అని పల్కి యాతని చరణంబులు కనులకద్దుకొనుచుండ రాజేం ద్రు డామె ననురాగంబున గనుచు "దేవీ! వైరాగ్యవ్ర తం బుజ్జగించి నీవు నాయంతఃపురరాజ్ఞి వయ్యెదవా? రాజ్యం బుజ్జగించి నేను నీయాశ్రమవాసుడను గా—?" యనెను. అనురాగ భరితంబులగు నవ్వాక్యంబులకు ప్రేమైక భాసురంబగు చిఱునవ్వు దేవిమోవిపై తొలం కెను. ఆహా! ఎంతనిసర్గమనోహర మా యొలనవ్వు!

---